నిరసన చేపడుతున్న కాలనీ వాసులు, నాయకులు

'రెవెన్యూ సదస్సు' అర్జీలపై నిర్లక్ష్యం

• తహశీల్దార్ల తీరుపై కలెక్టర్ అసంతృప్తి • గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి వినతుల స్వీకరణ



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ సదస్సులో పూర్తి కావస్తున్న తరుణంలో ఇప్పటివరకు అర్జీలను పరిష్కరించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష తహసీల్దార్ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షిస్తూ ఓర్వకల్లు మండలానికి సంబంధించి మండల సర్వేయర్ వద్ద 165 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, సర్వేయర్ ఏం చేస్తున్నారని కలెక్టర్ ఓర్వకల్లు తహసీల్దార్‌ను ప్రశ్నించారు. మద్దికెర మండలానికి సంబంధించి 81, ఎమ్మిగనూరు 130, పత్తికొండ 80, కౌతాళం 98, పత్తికొండ 80, ఆలూరు111, ఆదోని37, కర్నూలు 125, గోనెగండ్ల 59 పెండింగ్‌లో ఉన్నాయని, అర్జీలను పరిష్కరించకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రెండు రోజుల్లోపు అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా నిలవాలి

- చేనేత సంచార వాహనం ప్రారంభంలో కలెక్టర్

చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసిన కార్మికులకు అండగా నిలవాలని కలెక్టర్ రంజిత్‌బాష సూచించారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు చేనేత కోపరేటివ్ సొసైటీ కి సంబంధించి చేనేత వస్త్రాలు కలిగిన సంచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. వాహనంలో ఉన్న పట్టుచీరలు, ఇతర చేనేత ఉత్పత్తులను కలెక్టర్ తిలకించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ప్రజలు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ సి వెంకటనారాయణమ్మ, జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగరాజారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చేనేత సంచార వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలి

- కమిషనర్ కార్యాలయం ముందు బిటిఆర్ నగర్ వాసుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిటిఆర్ నగర్‌లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో, కాలనీ ప్రజలు మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. కర్నూలు నగరంలోని 19, 20 వార్డుల సిపిఎం వార్డుకమిటీ ఆధ్వర్యంలో బిటిఆర్‌నగర్‌లో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీకాలువలు నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాంబర్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, సిసి రోడ్లు వేయాలని, అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్యదర్శి బి.రాధాకృష్ణ అధ్యక్షతవహించారు. సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.నరసింహులు, సిహెచ్ సాయిబాబాలు ధర్నానుద్దేశించి మాట్లాడారు. 20 యేళ్లుగా బిటిఆర్‌నగర్‌లో రోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని దశలవారీగా పోరాటం చేస్తున్నామన్నారను. కానీఅధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. పాలకపార్టీల రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం ఎన్నికల వచ్చినప్పుడు రోడ్లు కాలువలు నిర్మిస్తామని వాగ్దానంచేస్తున్నారన్నారు. మాటనిలబెట్టుకోవడంలో వైఫల్యం చెందారన్నారు. 2021 అక్టోబరు 29న డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లు నిర్మాణం కోసం రూ.40 లక్షల ఎస్టిమేట్ చేసి శిలాఫలకం పాతి కేవలం మెటల్ రోడ్డు మాత్రమే వేసి మున్సిపల్ అధికారులు, అప్పటి పాలకులు చేతులుదులుపుకున్నారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడం వల్ల మురుగునీరు ఇళ్ల మధ్యనే నిలిచిపోయి దోమలకు పందులకు నిలయాలుగా మారి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. దీని కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూతిరుగుతూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డ్రెయినేజీ కాలువలు, సిసిరోడ్లు వేసేంతవరకు పోరాటం కొనసాగుతుందని, దానికి ప్రజల సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎస్. రవీంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. బిటి ఆర్‌నగర్‌లో సిసిరోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, రోడ్లు కాలువలు లేకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందిపడుతున్నారని కమిషనర్ కు వివరించారు. కమిషనర్ స్పందించి వీలైనంత త్వరలో డ్రైనేజీ కాలువలు, రోడ్లునిర్మిస్తామని హామీఇచ్చారు. సిపిఎం నగర నాయకులు ఎస్ఎండి మహమ్మద్ రఫీ, సిపిఎం వార్డు నాయకులు ఎస్.పెద్దమాలిక్, పెద్దబాబు, శివకృష్ణ, చిన్నమాలిక్ , సుబ్బరాయుడు, నాగేశ్వరరావు, సత్యనారాయణ ,ఖాజా, శ్రీను, సీతమ్మ ,ముంతాజ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రైతులతో గోల్డ్ మైన్స్ అధికారుల చర్చలు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలంలోని జొన్నగిరి గ్రామంలో హంద్రీనీవా కాలవ నుండి పైప్ లైన్ ద్వారా గోల్డ్ మైన్స్ కంపెనీకి నీళ్లు మళ్లించడానికి జొన్నగిరి పొలాల మీదుగా పైప్‌లైన్ తీసుకెళ్లారు. ఆ పైప్ లైన్ ద్వారా వచ్చే నీళ్లను ఒక వాలు ఏర్పాటు చేసి చెరువు నింపాలని రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాములు, రైతు సంఘం మండల కార్యదర్శి కొండారెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు రంగారెడ్డి కోరారు. వారు మాట్లాడుతూ రైతుల కోసం చెరువుకు నీళ్లు వదులుతాం అంటేనే పని మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందిస్తూ గోల్డ్ మైన్స్ అధికారులు ట్యాంకర్లతో నీటిని గ్రామానికి సరఫరా చేస్తామని అన్నారు. రైతులు చెరువులలో నీరు తప్పనిసరిగా నింపాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన పని జరగనివ్వబోమని అన్నారు. అందుకు గోల్డ్ మైన్స్ మేనేజర్ రామ్మోహన్ రెడ్డిపై అధికారులతో మాట్లాడి రైతులకు చెబుతామని అన్నారు. సిపిఐ నాయకులునబీ రసూల్, సుల్తాన్, వెంకటేశ్వర్లు, మద్దతు తెలిపారు. రైతులు గుంత హనుమన్న, మిలటరీ వెంకటేశ్వర్లు, ఎలగాని ఈరన్న, నారాయణస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న నాయకులు, రైతులు

ఓటర్ల తుది జాబితా ప్రచురణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటర్ల జాబితాను అధికారులు ప్రచురించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో అధికారులతో కలిసి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఓటర్ల జాబితాను ప్రచురించి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఒ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల వద్ద సంబంధిత బిఎల్‌ఒలు తమ బూత్ ఓటర్ల జాబితాను ప్రచురించి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కొంతకాలం కిందట నిర్వహించిన స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా కొత్త ఓటు నమోదు, తొలగింపు ప్రక్రియ అనంతరం కర్నూలు నియోజకవర్గంలో 2,74,553 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. అందులో 1,32,658 మంది పురుషులు, 1,41,869 మంది స్త్రీలు, 26 మంది ఇతరులు ఉన్నారని ఆర్వో పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, ఆర్ఐ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతులను అందజేస్తున్న అధికారులు

మోడీ పర్యటనను వ్యతిరేకించండి

- విజభన హామీలను అమలు చేయని బిజెపి ప్రభుత్వం

- 7న నిరసనను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర విభజన సందర్భంగా ఏవైతే హామీలు ఇచ్చారో వాటిని అమలు చేస్తానని చెప్పిన ప్రధాని అవి ఏవి అమలు చేయకుండా మళ్లీ ఆంధ్ర రాష్ట్రానికి వస్తున్న ప్రధానికి వ్యతిరేకంగా ఈనెల 7న చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా బిజెపి, టిడిపి కలిసి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలను అమలు చేస్తామని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపడతామని, అమరావతి రాజధాని నిర్మాణాన్ని చేపడతామని చెప్పిన ప్రధానమంత్రి వాటిని అమలు చేయకుండా ఆంధ్ర రాష్ట్రానికి తీరని ద్రోహం చేశాడని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్రంలో అదే కూటమి అధికారంలో ఉన్నా ఒక్క మాట కూడా మోడీకి వ్యతిరేకంగా మాట్లాడకుండా రాష్ట్రానికి రావాల్సిన హక్కులను రాబట్టకుండా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాడని విమర్శించారు. తనపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వం ఉన్నప్పుడు ఎందుకు ప్రత్యేక హోదా గురించి ప్రశ్నించడం లేదన్నారు. ఎందుకు కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం నిధులు రాబట్టడం లేదని, ఎందుకు వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు కేటాయింపు కోసం ఒత్తిడి చేయడం లేదని, ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన వ్యక్తి ఈ రాష్ట్ర పర్యటన చేస్తున్న సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర పౌరులుగా మన రాష్ట్ర హక్కులు రాబట్టడం కోసం మోడీకి వ్యతిరేకంగా జరుగు నిరసన ప్రదర్శనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 7న కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఉదయం 10 గంటలకు నుండి కలెక్టర్ కార్యాలయం వరకు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో ప్రజలందరూ పాల్గొనాలని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ మెయిన్స్‌కు 241 మంది ఎంపిక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆరవ రోజు నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించి 241 మంది మెయిన్స్ ఫైనల్ పరీక్షలకు ఎంపికైనట్లు జిల్లా ఎస్పి జి బిందు మాధవ్ తెలిపారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఎపిఎస్‌పి రెండవ బెటాలియన్‌లో 6వ రోజు దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను కర్నూలు జిల్లా ఎస్పి జి. బిందు మాధవ్ దగ్గరుండి పర్యవేక్షించారు. సోమవారం 600 మంది అభ్యర్థులను పిలిచారు. 332 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వారికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 269 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగు పరీక్షలో 175 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. లాంగ్ జంప్‌లో 232 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్(ఫైనల్) పరీక్షకు 6వ రోజు 241 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఏదైనా సమస్యలపై , ఇతర కారణాలతో అప్పీలు చేసుకున్న అభ్యర్థులు ఈనెల28న హాజరు కావాలని జిల్లా ఎస్పి జి. బిందు మాధవ్ తెలిపారు. హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పి అడ్మిన్ జి.హుస్సేన్‌పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పి కృష్ణమోహన్, డిఎస్పిలు, సిఐలు, ఆర్ ఐలు, ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు, డిపిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పరుగు పరీక్షల్లో పాల్గొన్న అభ్యర్థులు

వాలీబాల్ మహిళా జట్టుతో విసి ఎన్‌టికె నాయక్

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఆర్‌యు వాలీబాల్ మహిళా జట్టు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ మహిళా పోటీలు ఈ నెల 8 నుంచి 11 వరకు చెన్నైలోని జెపిఆర్ విశ్వవిద్యాలయంలో జరుగనున్నాయని తెలిపారు. రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి వాలీబాల్ మహిళా జట్టు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనబోతుందని ఆర్‌యు అధికారులు తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఎన్‌టికె నాయక్, వైస్ ఛాన్సలర్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్ కుమార్ నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కెవి శివకిషోర్, యూనివర్సిటీ జట్టు మేనేజర్ పాల్గొన్నారు.

మహిళా జట్టు వివరాలు: రాగిణి రాజేశ్వరి, బికావ్య, షేక్‌ముబాషెరా (బసి రెడ్డి డిగ్రీ కాలేజీ, నందికొట్కూరు), వి.కళ్యాణి, యు.సుకన్య, సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కాలేజి ఫర్‌ఉమెన్, పి.జుబేదా, ప్రవల్లిక, ఎం శిరీష ఆర్ యూ, కెఎం శ్రీలేఖ, హరిత సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కాలేజి, ఎం జయలక్ష్మి, లక్ష్మి శ్రీ సాయి కష్ణ డిగ్రీ కాలేజి కర్నూలు ఉన్నారు.

ఆర్ఒ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన పాఠశాల చైర్మన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రేమట గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు వీలుగా స్థానిక పాఠశాల విద్య కమిటీ చైర్మన్ బియు.పల్లవి ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. విద్యార్థులకు సురక్షితమైనా తాగునీటిని అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలును నందూరి ప్రసాదరావు కమిటీకి అప్పగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 32 వార్డు నందూరి ప్రసాద్ రావు కమ్యూనిటీ హాల్లో గత ఐదు సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న 81, 82 సచివాలయాలను నందూరి ప్రసాదరావు కమ్యూనిటీ హాల్ కమిటీకి అప్పగించాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ రవీంద్ర బాబును సిపిఎం నగర కార్యదర్శి టి. రాముడు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. సాయిబాబా, కమ్యూనిటీ హాల్ కమిటీ అధ్యక్షులు కె. సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు ఎస్.మహమ్మద్ రఫీ వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం సచివాలయాల నిర్వహణ చేపట్టిందని, అందులో భాగంగా అప్పటి కమిషనర్ రవీంద్ర బాబు సచివాలయాలకు అప్పగించమని కమిటీని కోరగా రాతపూర్వక హామీ మేరకు కమ్యూనిటీ హాల్‌ను సచివాలయాలకు అప్పగించామన్నారు. సచివాలయాలు ఆరు నెలల లో ఖాళీ చేస్తామని హామీ ఇచ్చారని, ఐదేళ్లు అవుతున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో సచివాలయ నిర్మాణం కోసం ముజఫర్ నగర్ పార్కులో స్థల సేకరణ చేసి కొలతలు వేసి టెండర్లు పిలిచి మార్కింగ్ కూడా వేయించారని తెలిపారు. కరోనా కారణంగా సచివాలయ నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. కమ్యూనిటీ హాల్ లేని కారణంగా ఇక్కడ పేదవారికి పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు, పొదుపు లక్ష్మి మహిళల మీటింగులకు చాలా ఇబ్బందికరంగా ఉందని వారు కమిషనర్ కు తెలిపారు. వేలు ,లక్షలు ఖర్చుపెట్టి బయట ఫంక్షన్ హాళ్లలో ప్రజలు పెళ్లిళ్లు చేసుకోవడం కష్టంగా ఉందని తెలిపారు. గతంలో కమిషనర్ ఇచ్చిన హామీ మేరకు 81,82 సచివాలయాలను కొత్తగా నిర్మించి కమ్యూనిటీ హాలును నందూరు ప్రసాదరావు కమిటీకి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ తొందరగానే పార్కులో నిర్మాణం చేపడతామని తెలిపారు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాముడు, సిహెచ్‌సాయిబాబా, రఫి

రోజుకు రూ.500 చెల్లించలేం...

కమిషనర్ కు చిన్నవ్యాపారుల సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రతిరోజు రూ.500 చెల్లించాలంటే భారంగా ఉందని, చిన్న వ్యాపారస్తులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో చిన్నవ్యాపారుల సంఘం నాయకులు, సిఐటియు నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 27, 29వ వార్డుల హద్దుల్లో ఉన్న వ్యక్తి పెట్రోల్ బంక్ వద్ద కింద సుమారు 30 సంవత్సరాల నుండి 40 మంది నిరుపేదలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని జీవనం సాగిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. టూ వీలర్ బండ్లకు రెండు వైపులా టెండర్ తెలిచి డబ్బులు వసూలు చేస్తూ అవకాశం కల్పించారని, నష్టం వచ్చిందని చిన్న వ్యాపారస్తులు ఒక్కొక్కరు రోజుకు రూ.500 చొప్పున కట్టాలని బెదిరిస్తున్నారన్నారు. ఇది చాలా భారంగా ఉందని, రోజు వారి పని చేసుకుని వ్యాపారంతో కుటుంబాలను గడుపుకునే మాకు రోజుకు రూ.500 కట్టలేమంటే సాధ్యం కాదని కర్నూలు నగర కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. చిన్న వ్యాపారుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, సిఐటియు నగర ఉపాధ్యక్షులు టి. రాముడు, సిఐటియు నగర అధ్యక్షుడు నరసింహులు, సిఐటియు నగర కార్యవర్గ సభ్యుడు జి.ఏసు, 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, పిడి బాష, అక్కడ ఉన్న చిన్న వ్యాపారులు కలిసి కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కమిషనర్ స్పందిస్తూ అక్కడ నేను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. చిన్న వ్యాపారస్తులు మౌలాబి, చిట్టమ్మ, అబ్బర్, నాగరాజు, ఇమాంస తదితరులు పాల్గొన్నారు.

శోభ మృతి అంగన్వాడి ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి- పత్తికొండ

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పత్తికొండ సెక్టర్ సీనియర్ నాయకులు శోభ అనారోగ్యంతో మృతి చెందడంతో ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బి వీరశేఖర్, సిఐటియు డివిజన్ మాజీ కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు దస్తగిరి అంగన్వాడి వర్కర్స్ అని హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కాంతమ్మ అన్నారు. పత్తికొండ మండలం పందికొన గ్రామంలోని శోభ భౌతికకాయానికి సిఐటియు నాయకులు, అంగన్వాడి టీచర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంగన్వాడి సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాటం నిర్వహించారని, వారి హక్కుల కోసం రాష్ట్ర కమిటీ డైరెక్షన్‌లో పోరాటాల్లో ముందుండేవారని అన్నారు. శోభ స్ఫూర్తితో ఐసిడిఎస్‌లో సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసికట్టుగా పోరాడాలని అన్నారు. శోభ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ రూ.30 వేల ఆర్థిక సాయం ఇవ్వాలని ఆ కమిటీ నిర్ణయించడం హర్ష దాయకమని, ప్రస్తుత అవసరాల కోసం రూ.5 వేలు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశామన్నారు. అంగన్వాడి కార్మికులు ఆశీర్వాదమ్మ ,లక్ష్మి, వీరమ్మ ,వెంకటమ్మ, మునెమ్మ పాల్గొన్నారు.

శోభ భౌతికకాయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

అవినీతికి పాల్పడితే ఉపేక్షించం

డిఎఫ్‌సిఎస్ చైర్మన్ బిఎస్ నవీన్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చేప పిల్లల స్కాం సంబంధించి మత్స్యశాఖ అధికారులు అవినీతికి పాల్పడి ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డిఎఫ్‌సిఎస్ చైర్మన్ బిఎస్ నవీన్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేప పిల్లల స్కాం సంబంధించి మీడియాలో వచ్చిన వార్త కథనాలపై విచారణ చేపడుతున్నామన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం మత్స్య సహకార సంఘ సభ్యులు , మత్స్యకారులతో కలిసి కర్నూలు నగరంలో మత్స్య అభివృద్ధి కార్యాలయంలో ఉన్న చేపల పెంపకం చేసే ఫిష్ పాండ్స్‌ను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పెద్ద వీరేష్, డైరెక్టర్లు పోతులశేఖర్, నగేష్, మద్దిలేటి, మల్లీశ్వరుడు, మత్స్యకార సంఘ నాయకులు నాగశేషులు, భాస్కర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల జర్నలిస్టు కోఆర్డినేషన్ సభ్యునిగా టి.మద్దులేటి నియామకం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల చెన్నైలో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల జర్నలిస్టుల సమావేశంలో కోఆర్డినేషన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి కర్నూలు జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టు టి.మద్దిలేటి దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మద్దిలేటి ఎంపిక పట్ల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

మధు సుధాకర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)బోటనీ అధ్యాపకుడు దండుగుల మధు సుధాకర్ డాక్టరేట్ డిగ్రీని పొందినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి హర్షం వ్యక్తం చేశారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో బోటనీ ప్రొఫెసర్ అయిన ప్రొఫెసర్ జి. సుదర్శనం పర్యవేక్షణలో 'శేషాచలం కొండ శ్రేణులలో ఎంచుకున్న మొక్కల కిమోటాక్సనమిక్ క్యారెక్టరైజేషన్ జీవ సంబంధ కార్యకలాపాలపై అధ్యయనం అను అంశం పై విస్తృతమైన పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టా పొందారు.

పూజ చేసి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బివి

19 కొత్త బస్సులు తెచ్చాం

- నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ బివి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత ప్రభుత్వం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు ఒక బస్సు కాదు, ఒక్క టైరు కూడా తీసుకొచ్చిన పాపాన పోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక 6 నెలల్లో నాలుగు సార్లు 19 కొత్త ఆర్టీసీ బస్సులను తీసుకొచ్చామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో 2 కొత్త బస్సులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం త్వరలోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ప్రతి రూటులోనూ బస్సులను తిరుగుతాయని తెలిపారు. ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

మహోన్నతమైన వ్యక్తి వాల్మీకి

- ఎమ్మెల్యే విరుపాక్షి

- వాల్మీకి మహర్షి దేవాలయానికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామ పెద్దలకు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

మానవాళికి ఒక నిబద్ధత గల సూత్రాలను అందించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి మహర్షి అని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. సోమవారం హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో వాల్మీకి మహర్షి దేవాలయానికి స్టీల్ గ్రిల్ వేయించడానికి ఆర్థిక సహాయం అందించాలని వైసిపి హొళగుంద కన్వీనర్ షఫివుల్లా ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ఎమ్మెల్యే విరుపాక్షికి వారి నివాసంలో విన్నవించారు. వారి విన్నపం మేరకు వాల్మీకి మహర్షి దేవాలయంలో స్టీల్ గ్రిల్ వేయడం మంచి పని అని, తనవంతుగా రూ.50 వేలు అందజేశారు. మంచి పనులకు తన వంతు సహాయం చేయడానికి ముందుంటానన్నారు. ఆర్థిక సహాయం అందించినందుకు గజ్జహళ్లి గ్రామ పెద్దలు విరుపాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధికి కమిటీ కృషి చేయాలి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - నందవరం

పుస్తకాలను అందజేస్తున్న ప్రిన్సిపల్ శైలజ

పాఠశాల అభివృద్ధికి యాజమాన్య కమిటీ సభ్యులు కృషి చేయాలని నందవరం కెజిబివి ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఆమె పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాల అభివృద్ధిలో యాజమాన్య కమిటీ సభ్యుల పాత్ర కీలకమని తెలిపారు. విద్యా రాష్ట్ర ఫైర్మెన్, వైస్ ఛైర్మన్లు, కమిటీ సభ్యులు పాఠశాలను సందర్శించి భోజనం, పరిసర ప్రాంతాన్ని తనిఖీ చేయాలని చెప్పారు. గ్రామంలో విద్యార్థినుల తల్లిదండ్రులు వలసలు వెళితే విద్యార్థినులను తీసుకెళ్లకుండా పాఠశాలలోనే చదువుకునేలా చూడాలని తెలిపారు. విద్యార్థినులను ఎక్కువ రోజులు ఇల్లు దగ్గర ఉండకుండా పాఠశాలకు వచ్చేలా అవగాహన కల్పించి హాజరు శాతాన్ని పెంచేలా యాజమాన్య కమిటీ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులకు యాజమాన్య కమిటీ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు నాగవేణి, ఛైర్మన్ భీమప్ప, వైస్ ఛైర్మన్ సునీత, సభ్యులు లింగప్ప, నరసప్ప పాల్గొన్నారు.

పంట ఇన్సూరెన్స్ రసీదు ఇవ్వాలి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

పంటలు వేసుకున్న రైతులందరూ మీసేవ కేంద్రాలకు వెళ్లి ఇన్సూరెన్స్ చేయించుకున్న రసీదులను తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాలకు వెళ్లి అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు ఇవ్వాలని ఎఒ జయలక్ష్మి తెలిపారు. సోమవారం చిప్పగిరి రైతు సేవ కేంద్రంలో ఆమె మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ చేసుకున్న రసీదులను అగ్రికల్చర్ అధికారులకు ఇవ్వాలని, వారు ఆ రసీదును వ్యవసాయ అగ్రికల్చర్ యాప్‌లో పూర్తి డేటాను పొందుపరుస్తారని తెలిపారు. ప్రభుత్వం అందించే రాయితీలు, పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. మరిచిపోయిన రైతులంతా త్వరగా అగ్రికల్చర్ అధికారులకు ఇవ్వాలని సూచించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగస్వామి పాల్గొన్నారు.

బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- అఖిలపక్ష నాయకులు

- హెబ్బటం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర

ప్రజాశక్తి - ఆలూరు

హొళగుంద నుంచి ధణాపురం వరకు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ ఎంఎల్, డివైఎఫ్ఐ, ఎంఆర్‌పిఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర హెబ్బటం నుంచి ఆదోని సబ్ కలెక్టర్ వరకు సాగింది. ఈ పాదయాత్రను సిపిఎం హొళగుంద మండల నాయకులు ఎస్.వెంకటేశులు అధ్యక్షతన డిసిసి అధ్యక్షులు మురళీ కృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్ర హెబ్బటం నుంచి నాగనాథనహళ్లి, ధణాపురం, కల్లుబావి, తిమ్మారెడ్డి బస్టాండ్ మీదుగా సబ్ కలెక్టర్‌కు చేరుకుంది. ఆలూరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ లక్ష్మీనారాయణ, సిపిఎం ఆలూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్, కృష్ణ, శేఖర్, నాగరాజు, మైనా, రత్నమ్మ, షేకున్ బీ, గౌసియా బీ, గిరి, వనజ, మహేశ్వరి, కాంగ్రెస్ నాయకులు పూల రామాంజినేయులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎల్లప్ప, కత్తి రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆలూరు : జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న రాధాకృష్ణ, మురళీకృష్ణ

ఆదోని : అఖిలపక్షం ఆధ్వర్యంలో పాదయాత్ర సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. హెబ్బటం నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సుమారు 25 కిలోమీటర్లు ఎర్రని ఎండను సైతం లెక్క చేయకుండా పాదయాత్ర కొనసాగించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. హొళగుంద నుంచి ఆదోని మండలం ధణాపురం వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో ఆదోనికి రాకుండా అవసరాల నిమిత్తం బళ్లారికి వెళ్తున్నారని చెప్పారు. రోడ్డు కోసం పలుసార్లు భూమి పూజ చేసినా ఎందుకు ప్రారంభించలేదని సబ్ కలెక్టర్‌ను నిలదీశారు. రోడ్డు నిర్మాణం జరగకుండా ఎవరు అడ్డుపడుతున్నారో నిగ్గు తేల్చాలని పట్టుబట్టారు. నిధులు ఉన్నాయా లేదా, ఆ నిధులను కాంట్రాక్టర్ మింగారా అన్నది కూడా తేల్చాలని డిమాండ్ చేశారు. నిధులుంటే పని చేయకుండా నిర్లక్ష్యం చేసిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ... రోడ్డు సమస్యను కలెక్టర్‌కు నివేదిస్తామని, ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకొని పనులు జరిగేలా శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఆలూరు, ఆదోని ఇన్‌ఛార్జీలు లక్ష్మీనారాయణ, రమేష్ యాదవ్, సిపిఎం నాయకులు గోపాల్, లక్ష్మణ్, నారాయణస్వామి, తిప్పన్న, హనుమంతు, కృష్ణ, షాకీర్, వెంకటేష్, మహిళా నాయకులు రత్నమ్మ, షేకున్ బీ, మహేశ్వరి, డివైఎఫ్ఐ నాయకులు మైనా, వీరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్, శ్రీనిత్, సాయినాథ్, ఇంగలదహాల్ రైతు కూలీ సంఘం నాయకులు ప్రసాద్ ఉన్నారు. **హొళగుంద** మండలం హెబ్బటం గ్రామం నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. ఆదోని నుంచి హొళగుందకు రోడ్డు మోకాలు ఎత్తు గుంతల పడి అధ్వాన స్థితికి చేరిందని తెలిపారు. గత ప్రభుత్వంలో రోడ్డుకు భూమి పూజ చేశారని, రోడ్డును కూడా తవ్వారని చెప్పారు. కాంగ్రెస్ ఆలూరు ఇన్‌ఛార్జీ లక్ష్మీనారాయణ, ఆదోని ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్, బీఎస్పీ నాయకులు రామలింగప్ప, సిపిఎం ప్రాంతీయ కన్వీనర్ హనుమంతు, సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి, కృష్ణ, షాకీర్, మైన పాల్గొన్నారు.

ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హొళగుంద : పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

టిడిపిని బలోపేతం చేస్తాం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

క్షేత్రస్థాయిలో కేడర్‌ను చైతన్యపరిచి టిడిపిని బలోపేతం చేస్తామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. సోమవారం ఆమె నివాసంలో ఆదోని మండలం ఆరెకల్ గ్రామంలో వైసిపికి చెందిన ఎంపిటిసి బోయ శ్యామల, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి టిడిపిలోకి చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ మాట్లాడారు. రాబోయే రోజుల్లో టిడిపి అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరే విధంగా చొరవ చూపాలని సూచించారు. రాబోయే ఐదేళ్లలో ఆరెకల్ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని తెలిపారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, సాధిక్ వలీ, కపటి మాజీ సర్పంచి మాధవ, కుప్పగల్ మాజీ సర్పంచి రాముడు, గణేకల్ ఎల్లప్ప, బంగారు బాబు, మల్లయ్య, తిమ్మప్ప, లక్ష్మయ్య, కిష్టప్ప, పెద్దతుంబలం శ్రీనివాస్, నరసప్ప, అలసందగుత్తి వెంకటేష్ ఉన్నారు.

టిడిపిలో చేరుతున్న ఎంపిటిసి

బాధితులకు అండగా ఉంటాం

- టిడిపి సీనియర్ నాయకులు రంగస్వామి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో భూకబ్జా వల్ల మోసపోయిన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి సీనియర్ నాయకులు రంగస్వామి నాయుడు భరోసా ఇచ్చారు. సోమవారం వారి గృహానికి వెళ్లి ఈశ్వరప్ప, మోహన్, సునీల్‌కు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండగిరిలో సర్వే నెంబర్ 321ఎలో 5.51 ఎకరాల విస్తీర్ణం గల భూమిని కబ్జా చేసిన వ్యక్తులను వదిలే ప్రసక్తే లేదని, ఇప్పటికే పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి కబ్జాలు మరోసారి జరిగితే సహించేది లేదని, బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. వారికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. నాయకులు బాబు నాయుడు, శ్రీనివాస చౌదరి, బసాపురం రామస్వామి, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ ఆచారి, కుప్పగల్లు తిరుమల్, సుబ్బు, గోనబావి గోపాల్, గణేకల్లు విరుపాక్ష, బంగారయ్య, వై.రంగస్వామి, కుప్పగల్లు వెంకటేష్, రామదాస్, నాగేంద్ర, కార్వన్‌పేట్ గొల్ల వీరేష్ యదవ్, మేకల వీరేష్, గోపాల్ యాదవ్, కల్లుబావి గొల్ల వీరేష్ యాదవ్, పర్వతాపురం షణ్ముఖ ఉన్నారు.

మాట్లాడుతున్న రంగస్వామి నాయుడు

ఆదోనిలో భూకబ్జాలపై నిగ్గుతేల్చాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆదోనిలో జరుగుతున్న భూకబ్జాలపై ప్రభుత్వం నిజాలను నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని మండలం శివారు ప్రాంతాల్లో రూ.కోట్ల విలువ చేసే 6 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేశారని, బతికున్న ఈశ్వరప్ప చనిపోయినట్లు సర్టిఫికెట్ సృష్టించి రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. దీనికి కారణమైన బాధ్యులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూకబ్జాలు లేని ఆదోనిని చూపిస్తామని ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే హామీఇచ్చారని, గతానికి భిన్నంగా కబ్జాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆధార్ కార్డు మార్చడం, డెత్, ఫ్యామిలీ సభ్యుల సర్టిఫికెట్లు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రెవెన్యూ, రిజిస్టర్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక కబ్జాలు పెరిగి పోయాయన్నారు. కూటమి ప్రభుత్వం బోగస్ పింఛన్ల ఏరివేత పేరుతో అర్హులను తొలగించే ప్రయత్నం చేస్తోందని, విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి, రామాంజినేయులు, జె.రామాంజనేయులు, అయ్యప్ప, తిక్కప్ప, పాండు రంగ, అయ్యన్న, మునిస్వామి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

ఎస్సీ సర్టిఫికెట్లు రద్దు చేయాలి

- దళిత ఐక్య వేదిక దీక్ష

ప్రజాశక్తి - ఆదోని

మాదారి/మాదాసి కురువ పేరుతో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం పొందిన వారిపై చర్యలు తీసుకొని రద్దు పరచాలని దళిత ఐక్యవేదిక నాయకులు మహానంది, సాయిరాం, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాదారి/మాదాసి కురువలు ఈ ప్రాంతంలో లేరని, ఎస్సీ సర్టిఫికెట్ కోసమే కొందరు కుల గణనలో నమోదు చేయించుకొని ఎస్సీ సర్టిఫికెట్ పొందారని తెలిపారు. ఇప్పటికే అధికారులకు అభ్యంతరాలు తెలిపామన్నారు. ఇంతవరకు ఎక్కడా రద్దుపరిచిన దాఖలాలు లేవని తెలిపారు. ఆంజనేయులు, తాయప్ప, మహానంది, వెంకట్రాముడు, మల్లికార్జున, వీర భద్ర, లింగప్ప, వనికేరి నరేష్ కుమార్, హను మంతు, భాస్కర్, హరికష్ణ దీక్షలో కూర్చున్నారు. దళిత నాయకులు, అడ్వయిజర్లు చంద్రయ్య, కిరణ్ కుమార్, చంద్రశేఖర్, వైపి.కృష్ణమోహన్, నకుల రాజ్, స్వామి దాసు, దేవదాసు, మధు బాబు, వైపి.శేఖర్, వీరేష్, నాగరాజు, ఈరన్న, హను మంతు, రాజు, గోవిందు మద్దతు తెలిపారు.

కుల ధ్రువీకరణను రద్దు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని వెంకటాపురం గ్రామంలో మాదాసి/మాదారి కురవలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.తిమ్మన్న డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెంకటాపురం గ్రామంలో మాదాసి/మాదారి కురువలు లేరని, లేని వారిని ఎస్సీ జాబితాలో చేర్చి అధికారులు వారికి ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వడం దారుణమని విమర్శించారు. ఎస్సీలుగా ఉన్న వారిని క్రిస్టియన్ కింద నమోదు చేసి అధికారులు కులగణన జాబితాలో చేర్చి తప్పిదాలు చేశారని, మాదాసి/మాదారి కురవలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ మండల సహాయ కార్యదర్శి రాజా రమేష్, చర్మ కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంథోని, పెద్ద ఆంజ నేయ, ఎం.రంగన్న, జామేశ్, గుండప్ప, నడిపి ఆంజనేయ, రమేష్, ఎం.గుండప్ప పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

వృద్ధురాలికి గాయాలు

- పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద గ్రామానికి చెందిన వృద్ధురాలు మల్లమ్మను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... వృద్ధురాలు సోమవారం హొళగుంద గ్రామ శివారులోని తమ పొలానికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీట్టింది. రెండు కాళ్లు, కుడి చేయి విరిగింది. తలకు సైతం తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హొళగుంద పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మహారాజశ్రీ కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 14/2018 in O.S. No. 202/2005

సున్నితి చంద్రశేఖర్,
తండ్రి ఎస్. రాధాకృష్ణమూర్తి,
R/o. కోవెలకుంట్ల గ్రామం మరియు మండలం,
నంద్యాల జిల్లా. ... D.Hr

-Vs-

సకల చంద్రయ్య Died by his Lrs.
1) సకల సూర్యమ్మ, W/o. Late ఎస్. చంద్రయ్య,
2) సకల రాజేష్, S/o. Late ఎస్. చంద్రయ్య,
Both are R/o. H.No. 21-91,
Near Kasturi English Medium School.
1 Town, కర్నూలు టౌన్ మరియు జిల్లా. .. J.Drs.

సమన్లు

పై E.P. నందు D.Hr. తన డిక్రి మొత్తం పైకం రాబట్టుకొనుటకు దాఖలు చేసియున్నారు. పై E.P. లో మీకు కోర్టు నోటీసులు ముట్టనందున మరియు ఆచూకి తెలియనందున కోర్టు వారు 08-01-2025వ తేదీన మీ సమాధానము కొరకు వాయిదా వేసి ఉన్నారు. ఆ దినము ఉదయం 10-00 గంటలకు మీరు వకీలు ద్వారా కాని, స్వయంగా కాని కోర్టుకు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెయును. లేని యెడల విచారించి మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా తేది : 08-01-2025

షేక్ ఖాసీం సాహెబ్
D.Hr న్యాయవాది, కోవెలకుంట్ల,
సెల్ : 7981551854

మహారాజ శ్రీ కర్నూలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఇ.పి.నెం.42/2023 ఇన్ ఓ.యస్.8/2023

యస్.మల్లికార్జున రెడ్డి. ...డిక్రిహోల్డర్

-వర్సెస్-

అత్తులూరి విజయ్‌కుమార్. ...జె.డి.అర్

వేలం ప్రకటన

ఈ క్రింద కనబరచిన స్థిరాస్థిని కోర్టువారు 24-01-2025 వతేది ఉదయం 10.30 గంటల నుండి కోర్టు ప్రంగణములో వేలం వేయుదురని తెలియజేయడమైనది.కావలసిన వారు వేలంలో పాల్గోన వచ్చును.

షెడ్యూలు :

Kurnool Division Sub-Division, Kurnool Municipal Corporation, Kallur Gramapanchayath, Kallur (V) In Survey No.328/1A,328/1C,387/3 Land piki, Total extent A.C.0.05.3/4 cents in that Northern side Ac.0.04.3/4 cents or 38.5 yards.

Bounded as
East : Land of SAP Camp.
West : Remaining Land of Somisetty Padmavathi
North : Place of Somisetty Srinivasulu.
South : Place of Somisetty Padmavathi.

Measurements :-
1st Item : East-West 57 Feet or 17.3736 meters
North - South : 30 feet or 9.1440 meters
2nd Item : Eastern side : North-south : 14 Feet or 4.2672 meters
Western side : North -South : '0'Feet pr 0.0000 meters
Northern side : East - West : 57 feet or 17.3736 meters
Southern side : East - West : 57 feet or 17.3736 meters
Total Extent :2109 SFT or 234.33 Sq. yards.
D.Hr. Value : Rs.2,00,000/-
Amin Value : Rs.60,00,000/-

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వేలం తేది : 24-01-2025

టి.ఈశ్వర్‌బాబు
డి. హెచ్. ఆర్ తరుపు న్యాయవాది.
కర్నూలు.

అభివృద్ధికి ఆమడ దూరం

- కాలనీలో సమస్యల తిష్ట - మైనార్టీ కాలనీ వాసుల ఇబ్బందులు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

అభివృద్ధికి బాటలు వేస్తున్నామని పాలకులు చెబుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినా ఇక్కడి ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. కాలనీ ఏర్పడి 30 ఏళ్లు గడిచింది. అభివృద్ధికి నోచుకోకుండా, మౌలిక సదుపాయలు లేక ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది మైనార్టీ కాలనీ వాసుల అధ్వాన పరిస్థితి.

ఆదోని పట్టణ శివారులో మైనార్టీ కాలనీ 30 ఏళ్ల క్రితం ఏర్పడింది. అప్పటి టిడిపి హయాంలో మైనార్టీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వ సహాయంతో పక్కా గృహాలు నిర్మించారు. అక్కడ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిర్మించిన కొన్నేళ్లకే ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. సొంతిల్లు లేని వారు అక్కడ నిర్మించిన ఇళ్లకు మరమ్మతులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సుమారు 100 కుటుంబాలు తాపీ మేస్త్రీలు, దినసరి కూలీలు, ఆటో డ్రైవర్లు, ఇళ్లలో పనిచేసే వారు ఒకే వర్గానికి చెందిన మైనార్టీలు కాలనీలో నివసిస్తున్నారు. పట్టణం నుంచి టిజిఎల్ కాలనీ మీదుగా మైనార్టీ కాలనీకి వెళ్లాల్సి వస్తోంది. ఈ కాలనీ 39వ వార్డులోకి వస్తుంది. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు ఇళ్ల మధ్య నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటుకు గురై మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

పట్టణానికి దూరంగా మైనార్టీ కాలనీ ఉంది. అక్కడ సమస్యలు తెలుసుకునేందుకు మున్సిపల్ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. కుళాయి పైపులకు లీకేజీలు ఏర్పడి మురుగునీరు కలుస్తోందని, మరమ్మతులు చేపట్టాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు.

వేధిస్తున్న రోడ్డు సమస్య

కాలనీలో రెండు ప్రధాన రోడ్లు, ఆరు లింక్ రోడ్లు ఉన్నాయి. కాలనీ ఏర్పడినప్పుడు అరకొరగా రోడ్లు వేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రస్తుతం 20 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులూ జరగకపోవడంతో మట్టి రోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. నిధులు మంజూరయ్యాయని, రోడ్లు వేయిస్తామని అధికారులు చెబుతున్నారు. పనులు ప్రారంభమైన దాఖలాలు కనిపించడం లేదు. ఆదోని నుంచి కాలనీకి వెళ్లేందుకు ఈద్గా వరకు రోడ్డు సదుపాయం ఉంది. అక్కడి నుంచి కాళ్ల రస్తా మాత్రమే ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు నిలవడం వల్ల రాకపోకలకు అనుకూలంగా లేదు. ఎస్సీ నెంబర్ త్రీ హాస్టల్ ప్రహరీ నుంచి కాలనీకి 80 అడుగుల రోడ్డు ఇస్వీ వరకు ఉందని మ్యాప్‌లో చూపుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. నిధులు లేవని చేతులెత్తేయడం వల్ల ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఇళ్ల మధ్య ముళ్లకంపలు పెరగడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళలో అపరిచిత వ్యక్తులు వస్తున్నారని, భయాందోళన గురవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పోలీసు గస్తీ ఏర్పాటు చేయించాలని కోరినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. శివారు ప్రాంతంలో ఉన్న మైనార్టీ కాలనీ పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడి అంగన్వాడీ కేంద్రం, వైద్య సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

మట్టి రోడ్డుపై నిలిచిన నీరు

కాలనీని సందర్శించాలి

- ఇక్బాల్, ఆవాజ్ కమిటీ పట్టణ కార్యదర్శి, ఆదోని

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతులు ఇస్తూనే ఉన్నాం. నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. ఎవరూ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. నీరు కలుషితమై కుళాయిలో వస్తున్నాయని చెబుతున్నా స్పందించడం లేదు. వేలాది రూపాయలు అద్దెలు చెల్లించుకోలేక అసౌకర్యాల మధ్యనే నివసిస్తున్నాం. ఓట్లకు తప్ప అభివృద్ధికి మేము నోచుకోవడం లేదు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న కాలనీ అభివృద్ధి కలను సాకారం చేయాలి.

కౌన్సిల్‌లో గళమెత్తుతూనే ఉన్నాం

- ఫయాజ్ అహ్మద్, కౌన్సిలర్

మైనార్టీ కాలనీ 39వ వార్డు పరిధిలో ఉంది. అక్కడ రోడ్లు, డ్రెయినేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రతినెలా కౌన్సిల్‌లో అడుగుతూనే ఉన్నాం. వైసిపి హయాంలో రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం మారడంతో పట్టించుకునే వారే లేరు. కాలనీలో పాఠశాల ఏర్పాటు చేయించాం. ఈద్గా నుంచి కాలనీకి రోడ్డు ఏర్పాటు చేయించాల్సి ఉంది. కాలనీ వాసుల సహకారంతో ఆ సమస్య కూడా పరిష్కారానికి చొరవ తీసుకుంటాం.

సమస్యలు పరిష్కరిస్తాం



- కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని

కాలనీలో సమస్యలు తెలుసుకునేందుకు త్వరలోనే పర్యటిస్తాం. ప్రస్తుతం రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. రోజువారీగా శానిటేషన్ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఇళ్ల మధ్యలో ఉన్న ముళ్లకంప తొలగింపు, సిమెంట్ రోడ్లు పూర్తిస్థాయి నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. కౌన్సిల్‌లో తీర్మానం చేయించి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. కాలనీకి వెళ్లేందుకు రోడ్డు సదుపాయం కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

ప్రభుత్వ విద్యారంగంపై

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రభుత్వ రంగ విద్యావిధానంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రంగప్ప విమర్శించారు. ఆదివారం రాత్రి పెద్దకడబూరు బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జి.రామన్న, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.సురేష్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎం.రామన్న, కె.బొజ్జప్ప, మూర్తి హాజరయి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా మోడీ ప్రభుత్వ అడుగుజాడల్లో నడుస్తోందని మండిపడ్డారు. విద్యారంగ సమస్యలపై రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. నూతన పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బికె.విల్సన్, జె.రాజు, ఉపాధ్యక్షులుగా పవన్, భీమా, అర్జున్, చరణ్, స్టాలిన్, ఉదయ్, సహాయ కార్యదర్శులుగా చరణ్, యువరాజ్, సందీప్, ప్రతాప్, రాజు, ఆనంద్‌తో పాటు 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. డివైఎఫ్ఐ నాయకులు దేవదాసు, శంకర్, ఆశీర్వాదం, లాజర్, బెంజిమన్ పాల్గొన్నారు.

'వాలంటీరు' గురించి తప్పుగా మాట్లాడిన

మంత్రి లోకేష్ వెనక్కి తీసుకోవాలి

- ఎపి వాలంటీరు యూనియన్ (సిఐటియు) నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వాలంటీరు వ్యవస్థ గురించి తప్పుగా మాట్లాడిన మంత్రి నారా లోకేష్ మాటను వెనక్కి తీసుకోవాలని ఎపి గ్రామ/వార్డు వాలంటీరు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు సురేష్ అధ్యక్షత వహించారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు మాట్లాడుతూ... గతంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 'వాలంటీరు వ్యవస్థ లేదు. పేరు లేదు' అంటూ వాలంటీర్ల గురించి తప్పుగా మాట్లాడుతూ అవమనించడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తోందని, వాలంటీర్లను వీధుల్లోకి తీసుకొని పెండింగ్ వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే కాలంలో వాలంటీర్లను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. వాలంటీర్లు నవీన్, శిరీష, ఈశ్వరి, పుష్ప, నాగవేణి, పార్వతి, లక్ష్మి, రవికుమార్, మధు, భీమేష్, నవీన్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

- ఉదయ్ కుమార్‌ను అభినందించిన నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆస్పరి మండలం జొహరాపురం గ్రామానికి చెందిన కెసి.ఉదయ్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ బీసీ భవన్‌లో ఛైర్మన్ దేవేంద్రప్ప, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, జనసేన పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు చింత సురేష్ బాబు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు చేపట్టిన ఉదయ్ కుమార్ మాట్లాడుతూ... కురుబ కార్పొరేషన్ ద్వారా కురుబల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కురుబ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో కార్పొరేషన్ లక్ష్యంగా పని చేస్తుందని చెప్పారు. కార్పొరేషన్ ద్వారా గొర్రెల పెంపకం, ఉన్ని పరిశ్రమ, ఇతర వృత్తులకు పునాది వేసేలా పథకాలు అమలు చేసే దిశగా ముందుకెళ్తామని తెలిపారు. జనసేన ఆస్పరి మండల అధ్యక్షులు అరవింద్ కుమార్, నాయకులు అంజి కుమార్ పాల్గొన్నారు.



ఉదయ్ కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు